క్లుప్తంగా

ఎదురెదురుగా ఢీకొన్న పోలీసు వాహనాలు



బీఆర్‌టీఎస్‌లో ఢీకొన్న రెండు పోలీస్ వాహనాలు

ఆరిలోవ: బీఆర్‌టీఎస్ రోడ్డులో సంజయ్‌గాంధీ కాలనీ వద్ద రెండు పోలీస్ వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నగరం నుంచి హనుమంతవాక మీదుగా శుక్రవారం సాయంత్రం బీఆర్‌టీఎస్ రోడ్డు మధ్య లైన్‌లో సింహాచలం వైపు ఓ పోలీస్ అధికారి వాహనం వెళ్తోంది. అదే రోడ్డులో సింహాచలం నుంచి హనుమంతవాక వైపు మరో పోలీస్ అధికారి ఉండే వాహనం వెళ్తోంది. ఈ రెండు వాహనాలు మితిమీరిన వేగంతో ప్రయాణించి సంజయ్‌గాంధీ కాలనీ వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. అది మధ్య లైన్ కావడంతో ఇతర వాహనాలు రాకపోకలు జరగలేదు. దీంతో రెండు వాహనాల్లో ప్రయాణించే వారితో పాటు ఇతరులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. పోలీస్ వాహనాలే మితిమీరిన వేగంతో ప్రయాణించి ప్రమాదానికి గురి కావడంపై స్థానికుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధురాలి మృతి



గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ గుర్తు తెలియని వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుమారు 75 సంవత్సరాలు వయసు గల వృద్ధురాలు జీవీఎంసీ పదో వార్డు ఆదర్శనగర్ పరిసరాలలో కొన్నాళ్లుగా యాచన చేస్తుండేది. ఆమె గురువారం మధ్యాహ్నం యచన చేస్తూ స్పృహ కోల్పోయి రోడ్డుపై పడిపోయింది. దీంతో స్థానికులు అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఆమె మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. ఆమె వివరాలు తెలియకపోవడంతో బంధువులు ఎవరైనా ఉంటే ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరుతున్నారు.

ఇద్దరు చైన్ స్నాచర్ల అరెస్ట్

తగరపువలస : భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో చైన్ స్నాచింగ్‌లకు పాల్పడిన ఇద్దరు దొంగలను క్రైమ్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వివరాలను మధురవాడ క్రైమ్ సీఐ జి.రాంబాబు, భీమిలి క్రైమ్ ఎస్ఐ సూర్యప్రకాష్ వెల్లడించారు. నగరంలోని ఆరిలోవకు చెందిన బడిగంటి ప్రణీత భీమిలి మండలం దాకమర్రి విలేజీ హెల్త్ క్లినిక్‌లో హెల్త్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు. ఆమె ఈ ఏడాది ఏప్రిల్ 16న దాకమర్రి వద్ద బస్సు దిగి డ్యూటీకి వస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి బుల్లెట్‌పై వచ్చి మెడలో గల అరతులం బంగారు చైన్‌ను తెంపుకుపోయాడు. అలాగే విజయనగరం జిల్లా చీపురుపల్లికి చెందిన వాడ్రేవు సుజాత ఈ నెల 7వ తేదీన సంగివలస శశి స్కూల్ వద్ద బస్సు కోసం వేచి చూస్తుండగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమె మెడలో నుంచి 2.50 తులాల బంగారు పుస్తెల తాడు, నల్లపూసల దండలో కొంత భాగం తెంచుకుపోయారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు భీమిలి పోలీస్ స్టేషన్ సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ముద్దాయిలను పట్టుకుని అరెస్ట్ చేసి వారి నుంచి మూడు తులాల బంగారు ఆభరణాలు, ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ముద్దాయిలు నగరంలోని కిన్నెర థియేటర్ ప్రాంతానికి చెందిన గారి గంగులు (ఇతని స్వస్థలం విజయనగరం జిల్లా భోగాపురం మండలం భైరెడ్డిపాలెం), మద్దిలపాలెం శీరపువారి వీధికి చెందిన కోయిలాడ సాయికిరణ్‌లుగా తెలిపారు.



ముడసర్లోవ పార్కు ఎదురుగా భక్తుల కోసం జీవీఎంసీ ఏర్పాటు చేసిన తాత్కాలిక మరుగుదొడ్లు



సింహగిరి కాలనీ వద్ద బీఆర్‌టీఎస్‌లో విద్యుత్ స్తంభాలకు అమర్చుతున్న కొత్త బల్బులు



పైనాపిల్ కాలనీ వద్ద జీవీఎంసీ, దేవస్థానం వేసిన టెంట్, భక్తుల కోసం క్యూలైన్

గిరి ప్రదక్షిణకు అంతా సిద్ధం

- బీఆర్‌టీఎస్‌లో ఏర్పాట్లు పూర్తి
- ఎక్కడికక్కడ స్వచ్ఛంద సేవా సంస్థల స్టాళ్లు



ముడసర్లోవ వద్ద ఓ స్వచ్ఛంద సంస్థ వేసిన టెంట్

ఆరిలోవ: సింహాచలం అప్పన్న స్వామి గిరిప్రదక్షిణకు బీఆర్‌టీఎస్ సిద్ధమైంది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసులు, జీవీఎంసీ అధికారులు, సింహాచలం దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రతి ఏటా మాదిరి ఈ సంవత్సరం కూడా పెద్ద సంఖ్యలో భక్తులు గిరిప్రదక్షిణ చేసే అవకాశం ఉన్నట్లు సంబంధిత విభాగాల అధికారులు భావించి చర్యలు చేపట్టారు. సాధారణంగా సింహాచలం తొలి పావంచా వద్ద భక్తులు కొబ్బరికాయ కొట్టి నడక ప్రారంభించడం ఆనవాయితీ. ఇప్పుడు పైనాపిల్ కాలనీ, అడవివరం మధ్యలో కొత్తగా నిర్మించిన ఘాట్ రోడ్డు వద్ద కూడా తొలపావంచా ఏర్పాట్లు చేస్తున్నారు. అక్కడ కూడా స్వామికి కొబ్బరి కాయలు కొట్టి నడక ప్రారంభించేలా దేవస్థానం అధికారులు చర్యలు చేపట్టారు.

- తూర్పు నియోజకవర్గం పరిధిలో అడవివరం కూడలి నుంచి పైనాపిల్ కాలనీ, ముడసర్లోవ, చినగదిలి, పెదగదిలి, హనుమంతవాక వరకు బీఆర్‌టీఎస్ రోడ్డు సుమారు 9 కిలోమీటర్ల మేర 4 నుంచి 5 లైన్లతో ఉంది. అక్కడి నుంచి హనుమంతవాక కూడలి, విశాలాక్షినగర్, జోడుగుళ్ల పాలెం వరకు సింగిల్ లైన్‌లో ప్రధాన రహదారి ఉంది. జోడుగుళ్లపాలెం నుంచి తెన్నేటి పార్కు మీదుగా అప్పుఘర్ వరకు రెండు లైన్ల బీచ్ రోడ్డు ఉంది. ఈ మార్గాల్లో జీవీఎంసీ, ఆరిలోవ పోలీసులు భక్తులు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశారు. అడవివరం కూడలి నుంచి ముడసర్లోవ, హనుమంతవాక మీదుగా అప్పుఘర్, ఎంవీపీ కాలనీ, వెంకోజీపాలెం, హెచ్‌బీ కాలనీ వరకు జీవీఎంసీ అధికారులు భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు. బీఆర్‌టీఎస్‌లో రోడ్లను పారిశుధ్య కార్మికులతో శుభ్రం చేయించారు. గోతులు పడిన రహదారులను తారు కలిపిన పిక్కతో పూడ్చారు. వెలగని విద్యుద్దీపాల స్థానంలో కొత్తవి అమర్చారు. అడవిరం, పైనాపిల్ కాలనీ, శ్రీకృష్ణాపురం, రామకృష్ణాపురం, ముడసర్లోవ, చినగదిలి, విమ్స్ ఆస్పత్రి, జోడుగుళ్లపాలెం, అప్పుఘర్ వద్ద తాత్కాలిక మరుగుదొడ్లను అందుబాటులో ఉంచారు. భక్తుల కోసం ప్రత్యేక అంబులెన్స్‌లు సిద్ధం చేశారు. ప్రథమ చికిత్స చేయడానికి వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.

- బీఆర్‌టీఎస్ రోడ్డులో అడవివరం కూడలి నుంచి హనుమంతవాక వరకు, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం నుంచి అప్పుఘర్ వరకు ఆరిలోవ పోలీసులు రక్షణ చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు ఆయా ప్రాంతాలలో పర్యటించి ఎక్కడ ఏయే చర్యలు చేపట్టాలో ప్రణాళికలు రూపొందించారు. గురువారం రాత్రి జిల్లా కలెక్టర్, నగర సీపీ బీఆర్‌టీఎస్‌ను సందర్శించి మరింత కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని పోలీసులను ఆదేశించారు. ఇందులో భాగంగా హనుమంతవాక కూడలిలో ఓ ఏసీపీ స్థాయి అధికారి, కొందరు సీఐలు, ఎస్ఐలతో పాటు మరో 30 మంది సిబ్బందితో విధులు నిర్వహించడానికి సన్నాహాలు చేపట్టారు. ప్రతి 100 మీటర్లకు మహిళా, పురుష కానిస్టేబుళ్లు ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఈ ప్రాంతంలో సుమారు 150 మందికి పైగా ఏఆర్, లా అండ్ ఆర్డర్ పోలీసులు విధులు నిర్వహించనున్నారు.

స్వచ్ఛంద సంస్థల స్టాళ్ల ఏర్పాటు

గిరి ప్రదక్షిణ భక్తులకు సేవలు అందించేందుకు **స్వచ్ఛంద సంస్థలు** రెండు రోజుల నుంచి స్థలాలు **రిజర్వ్ చేసుకున్నాయి.** స్టాళ్ల ఏర్పాటు కోసం రోడ్డు **పక్కన కొందరు ఇప్పటి**కే టెంట్లు వేశారు. ఇంకొం**దరు టెంట్లు వేయడా**నికి సిద్ధమవుతున్నారు. రెం**డు రోజులుగా కురు**స్తున్న వర్షాలకు గురువారం **వేసిన టెంట్లు** కొన్నిచోట్ల తడిసిపోయి కూలిపోయాయి. వాటిని నిర్వాహకులు మళ్లీ పునరుద్ధరిస్తున్నారు. బీఆర్‌టీఎస్‌లో ఫుట్‌పాత్‌లపై ఇప్పటికే పలువురు స్థలాలను రిజర్వ్ చేసుకొని టెంట్లు వేశారు. ప్రసాదంతో పాటు టీ, తాగునీరు, మజ్జిగ, మందులు కూడా అందించనున్నారు. అడవివరం నుంచి జోడుగుళ్లపాలెం వరకు సుమారు 200కు పైగా స్టాళ్లు ఏర్పాటు చేశారు.



పైనాపిల్ కాలనీ వద్ద రోడ్డుపై కప్పిన గోతులు

కిడ్నీ బాధితుడికి అరుదైన రోబోటిక్ సర్జరీ



రోబోటిక్ సర్జరీ చేసుకున్న వ్యక్తితో మెడికవర్ వైద్యులు

ఆరిలోవ: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఓ వ్యక్తికి హెల్త్ సిటీలో మెడికవర్ వైద్యులు అరుదైన రోబోటిక్ సర్జరీ చేశారు. ఈ సందర్భంగా సీనియర్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ భాస్కర్, చీఫ్ రోబోటిక్ సర్జన్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ కార్తీక్ చంద్ర తెలిపిన వివరాలు ప్రకారం.. ఒడిశా రాష్ట్రం రాయగడకు చెందిన 70 సంవత్సరాల వ్యక్తి దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధితో కొన్నాళ్లుగా బాధపడుతున్నాడు. ఆయన హెల్త్‌సిటీలో మెడికవల్ ఆస్పత్రిలో సంప్రదించారు. డాక్టర్ భాస్కర్ ఆయనను పరిశీలించి వైద్య పరీక్షలు చేశారు. రోగికి ఎడమ కిడ్నీ కింద భాగంలో 10 సెంటీమీటర్ల పెద్ద కణితి ఉన్నట్లు గుర్తించారు. అది క్యాన్సర్‌ను సూచించే కణితిగా గుర్తించి చీఫ్ రోబోటిక్ సర్జన్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ కార్తీక్ చంద్రకు సిఫార్స్ చేశారు. రోబోటిక్ పార్షియల్ నెఫ్రెక్టమిని అనే ప్రత్యేకమైన శస్త్ర చికిత్స చేసి కిడ్నీకి ఎలాంటి ప్రమాదం లేకుండా కణితిని తొలగించారు. తక్కువ నొప్పి, తక్కువ సమయంలో ఈ శస్త్ర చికిత్స చేసినట్లు కార్తీక్ చంద్ర తెలిపారు. ఈ శస్త్ర చికిత్స తర్వాత రోగికి డయాలసిస్ కూడా అవసరం రాలేదన్నారు. రోగిని శుక్రవారం డిశ్చార్జి చేశామన్నారు.

రైతుబజారు స్టాళ్లకు డ్రా



రైతులకు స్టాళ్ల టోకెన్లు అందిస్తున్న ఈవో కొండబాబు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజారులోని స్టాళ్లకు శుక్రవారం ఈవో కొండబాబు డ్రా తీసి, రైతులకు టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ మార్కెటింగ్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం 150 మంది రైతుల కార్డులకు సంబంధించి స్టాళ్లకు డ్రా తీస్తున్నట్లు తెలిపారు.

గిరి భక్తులకు ఇబ్బందులు రానీయొద్దు



జోరు వానలో గిరి ప్రదక్షిణ ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

- అధికారులకు మేయర్ గొలగాని ఆదేశం
- గిరి ప్రదక్షిణ మార్గం పరిశీలన

డాబాగార్డెన్స్: సింహగిరి ప్రదక్షిణ మార్గంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సింహాచలం తొలి పావంచా నుంచి అడవివరం, హనుమంతువాక, విశాలాక్షీనగర్, అప్పుఘర్, ఇసుకతోట, సీతమ్మధార, మాధవధార, గోపాలపట్నం మీదుగా గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తులు వెళ్లే మార్గాన్ని జీవీఎంసీ అదనపు కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గిరి ప్రదక్షిణలో లక్షలాది మంది భక్తులు పాల్గొంటారని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. పారిశుధ్యం, తాగునీరు, ఓఆర్ఎస్, ప్రథమ చికిత్స కేంద్రాలు, మరుగుదొడ్లు, విద్యుత్ దీపాలు వంటి ఏర్పాట్లపై మేయర్‌కు అదనపు కమిషనర్ విశ్వనాథన్ వివరించారు. పారిశుధ్య నిర్వహణకు అవసరమైన కార్మికులను అందుబాటులో ఉంచామన్నారు. తాత్కాలిక మరుగుదొడ్లు, లుంబినీ పార్కు సమీప బీచ్‌లో స్నానమాచరించే భక్తులు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు ఆయన చెప్పారు. బీచ్‌లో లైఫ్‌గార్డ్స్‌ను నియమించామన్నారు. స్వచ్ఛంద సంస్థలు, పలు సేవా సంఘాలకు స్టాళ్ల ఏర్పాటుకు స్థలాలు సూచించామని, ఆహార పదార్థాలు ప్లాస్టిక్‌లో కాకుండా ఆకులు, కాగితంతో తయారు చేసిన ప్లేట్లలో అందించాలని సూచించినట్టు ఆయన తెలిపారు. ప్రసాదం కౌంటర్ల వద్ద, నడక మార్గంలో ఎక్కడికక్కడ డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేశామని అదనపు కమిషనర్ మేయర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, ప్రధాన ఇంజినీరు రవికృష్ణరాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

డ్రైవర్లకు ఉరితాడు వంటి చట్టాలను రద్దు చేయాలి



సదస్సులో మాట్లాడుతున్న ముజాఫర్

డాబాగార్డెన్స్ : డ్రైవర్లకు ఉరితాడు వంటి చట్టాలను రద్దు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐఆర్‌టీడబ్ల్యుఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజాఫర్, ఆటో రిక్షా కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కె. సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రోడ్డు రవాణా డ్రైవర్లకు వర్తించేలా ఏర్పాటు చేసిన మోటార్ ట్రాన్స్‌పోర్టు సవరణ చట్టం 2019, జీవో 21ని రద్దు చేయాలని, పెట్రోల్, డీజిల్‌లో పన్ను మినహాయింపు, సెక్షన్ 106 (1 అండ్ 2) రద్దు చేయాలంటూ శుక్రవారం అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు శంకర్, విశాఖ జిల్లా మోటారు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు బి. జగన్, అధ్యక్షుడు శివ, కార్యదర్శి అప్పలరాజు సంయుక్త ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ రోడ్డు రవాణా డ్రైవర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పార్లమెంట్, అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి ఆయా సెక్షన్లు, చట్టాలు రద్దు చేయాలన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం డ్రైవర్లకు ఉరితాడు బిగించేలా గత ఏడాది డిసెంబర్ 21న చట్టాలు తీసుకువచ్చిందన్నారు. గతంలో ప్రమాదానికి డ్రైవర్ కారణమైతే గరిష్ఠంగా రెండేళ్ల శిక్ష ఉండేదని, ఇప్పుడు మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టం ప్రకారం పదేళ్ల జైలు, రూ.7 లక్షల జరిమానా విధించేలా నిబంధనలు తయారు చేశారన్నారు. ఇప్పటి వరకు ప్రమాదాలు జరిగిన వెంటనే స్టేషన్ బెయిల్ తీసుకునే అవకాశం ఉండేదని, కొత్త చట్టంలోని నిబంధనల వల్ల బెయిల్ కోసం ఎదురు చూడాల్సి వస్తుందన్నారు. ప్రమాదానికి గురైన వారికి ఉచిత వైద్య సదుపాయం ప్రభుత్వమే భరించాలని, చనిపోయిన వారికి రూ.10 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని, 60 ఏళ్లు దాటిన డ్రైవర్లకు రూ.9 వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జోరుగా అడల్ట్ బీసీజీ టీకాలు

అల్లిపురం : అడల్ట్ బీసీజీ టీకాల కార్యక్రమం జోరుగా కొనసాగుతోంది. 33వ వార్డు కుమ్మరవీధి సచివాలయం పరిధిలో అడల్ట్ బీసీజీ టీకాల కార్యక్రమం చేపట్టారు. ముఖ్యంగా షుగర్ వ్యాధితో బాధపడుతున్న వారు ఈ టీకాలు వేసుకోవాలని వైద్యసిబ్బంది సూచించారు. 60 సంవత్సరాలు పైబడిన వారు కూడా తప్పకుండా టీకాలు వేసుకోవాలని తెలిపారు. గుండెజబ్బులు ఉన్న వారు వీటిని వేసుకోరాదన్నారు. వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు పచ్చిరిపల్లి రాము అమ్మవారి వీధి, కుమ్మరవీధిలోని స్థానికులకు బీసీజీ టీకాలపై అవగాహన కల్పించి వారికి టీకాలు వేయించారు.

జోరు వాన

- తడిసి ముద్దయిన రహదారులు
- ఇబ్బందులు పడిన ప్రజలు



హెల్త్ సిటీ ఆనుకుని వర్షం నీటితో చెరువును తలపిస్తున్న ఖాళీ స్థలం



వాసవానిపాలెం తీరంలో ఎగసిపడుతున్న కెరటాలు

ఆరిలోవ: అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నియోజకవర్గం తడిసి ముద్దయింది. శుక్రవారం రోజంతా వర్షం కురవడంతో కాలు బయటపెట్టే వీలు లేక చాలా వరకు జనం ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో రహదారులు ఖాళీగా దర్శనమిచ్చాయి. రోడ్లు, ఖాళీ స్థలాలు జలమయమయ్యాయి. ఆరిలోవ ప్రాంతంతో పాటు విశాలాక్షినగర్, ఎంవీపీ కాలనీ, ఇసుకతోట, మద్దిలపాలెం, జాలరిపేట తదితర ప్రాంతాలలో రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోయింది. ఇంత వరకు ఉక్కపోతతో ఇబ్బందిపడిన నియోజకవర్గం ప్రజలు ఇప్పుడు కురుస్తున్న వర్షాలకు ఉపశమనం పొందారు. హెల్త్‌సిటీని ఆనుకొని ఉన్న ఖాళీ స్థలం వరద నీటితో చెరువును తలపించింది. బీఆర్‌టీఎస్ రోడ్డులో పెదగదిలి కూడలి వద్ద నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఆరిలోవ కాలనీ నుంచి వచ్చిన వరద నీరు శ్రీకాంత్‌నగర్, సూర్యతేజానగర్ మీదుగా పెదగదిలి వైపు ఉన్న పెద్ద గెడ్డలో ఉరకలు వేసింది. వీధుల్లో కాలువలు పొంగి కొన్నిచోట్ల రోడ్ల మీదకు మురుగునీరు చేరడంతో స్థానికులు అవస్థలు పడ్డారు.

మద్దిలపాలెం : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మద్దిలపాలెం పరిసర ప్రాంతాలు తడిసిముద్దయ్యాయి. ప్రధాన రహదారులపై వాహన చోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. ద్విచక్ర వాహనాలపై గొడుగులు పట్టుకుని సాహసోపేతంగా రాకపోకలు సాగించాల్సి వచ్చింది. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు జన జీవనం స్తంభించిపోయింది. చిరు వ్యాపారులు వ్యాపారాలు లేక ఇబ్బందులు పడ్డారు. కేఆర్ఎం కాలనీ, శివాజీపాలెం రోడ్డు, మంగాపురం కాలనీ, పిఠాపురం కాలనీ సర్వీసు రోడ్లు వర్షపు నీటితో నిండిపోయాయి.

బిక్కుబిక్కుమంటున్న మత్స్యకార గ్రామాలు

ఎంవీపీ కాలనీ: గత రెండు రోజులు కురుస్తున్న వర్షాలకు తీర ప్రాంత గ్రామాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. సముద్ర కెరటాలు ఉధృతంగా వస్తుండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని వాసవానిపాలెం, శివగణేష్ నగర్, జాలరిపేట ప్రాంతాల ప్రజలు భయపడుతున్నారు.

ఒడ్డుకు చేరిన నాటు పడవలు

తూర్పు నియోజకవర్గంలో సాగరతీరం జోడుగుళ్లపాలెం, అప్పుఘర్, వాసవానిపాలెం, శివగణేష్ నగర్, పెద జాలరిపేట ప్రాంతాల్లో విస్తరించింది. ఆయా ప్రాంతాల్లో దాదాపు 5 వేల నుంచి 6 వేల వరకు కుటుంబాలు నివాసముంటున్నాయి. వీరి ప్రధాన జీవనాధారం చేపల వేట. గతంలో హుద్‌హుద్ చేసిన బీభత్సం కారణంగా తుఫాను పేరు వింటే చాలు మత్స్యకారులు భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా తీరానికి దగ్గరగా వున్న వాసవానిపాలెం, శివగణేష్‌నగర్ వాసుల పరిస్థితి మరింత దయనీయం. అధికారుల ఆదేశాలకు అనుగుణంగా ప్రస్తుతం చేపల వేటకు వెళ్లకుండా ఇంటికే పరిమితమయ్యారు. నాటు, డీజిల్ ఇంజన్ పడవలు ఒడ్డుకు చేరాయి. ఈ నేపథ్యంలో ప్రత్యేక సహాయం అందించాలని తీర ప్రాంత గ్రామాల మత్స్యకారులు కోరుతున్నారు.



తుఫాను కారణంగా ఒడ్డుకు చేరిన నాటు పడవలు



మద్దిలపాలెం రహదారిపై జోరువాన

విద్యుత్ షాక్‌తో పాడి ఆవు మృతి

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు పెదగదిలి వద్ద బీఆర్‌టీఎస్ కూడలిలో విద్యుత్ షాక్‌కు గురై ఓ పాడి ఆవు ప్రాణాలు కోల్పోయింది. శుక్రవారం ఉదయం వర్షం పడుతున్న సమయంలో ఓ ఆవు పెదగదిలి కూడలిలో రోడ్డు పక్కకు వెళ్లే ప్రయత్నం చేసింది. పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు వేలాడుతున్న విద్యుత్ తీగలు ఆవును తాకడంతో షాక్‌కు గురై సంఘటన స్థలంలోనే మృతి చెందింది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు జీవీఎంసీ పారిశుధ్య విభాగం సిబ్బంది జేసీబీతో ఆవు కళేబరాన్ని సంఘటన స్థలం నుంచి వేరే చోటకు తరలించారు. కాగా ఆ ఆవు యజమాని ఎవరో తెలియదు. జీవీఎంసీ విద్యుత్ విభాగం అధికారుల నిర్లక్ష్యంగా కారణంగా ఈ సంఘటన జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.



మృతి చెందిన ఆవు



పార్వతీనగర్, శ్రీకాంత్‌నగర్ మధ్య రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



సూర్యతేజానగర్ వద్ద గెడ్డలో ప్రవహిస్తున్న వరద నీరు



వాసవానిపాలెంలో ఇళ్లలో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న మత్స్యకారులు

ఆదాయ పన్నుపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐటీ అధికారులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో శుక్రవారం ఆదాయ పన్నుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉక్కు పరిపాలన భవనంలోని ప్రధాన కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో పన్ను వర్తింపు, సడలింపునకు సంబంధించి ఆదాయ పన్ను శాఖలో ఇటీవల జరిగిన విశేషమైన మార్పులు, పరిణామాల గురించి ఐటీ డిప్యూటీ కమిషనర్ ఐ.మధుసూదనరావు, అసిస్టెంట్ కమిషనర్ పి.వి.శేషగిరిరావు వివరించారు. ఈ-ఫైలింగ్ చేయడం, డిజిటలైజేషన్ ప్రక్రియ, ముందుగా పూరించిన రిటర్న్‌లలో ప్రతిబింబించే ఆర్థిక సమాచారాన్ని సేకరించడం, డేటా సేకరణ, అప్పీళ్ల దాఖలు, ఆదాయ పన్ను కార్యాలయం సందర్శించకుండా తీసుకున్న వివిధ పద్ధతుల గురించి తెలిపారు. స్టీల్‌ప్లాంట్ సీజీఎం (ఫైనాన్స్) వి.శాంతకుమార్ మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు ఐటీ రిటర్న్‌లను సమర్పించడానికి ఆదాయ పన్ను అధికారులతో సంభాషించడానికి ఇది మంచి అవకాశమన్నారు. ఈ సందర్భంగా ఆదాయపు పన్ను శాఖ అధికారులు పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ ప్రాజెక్ట్స్ సీజీఎం ఇన్‌చార్జి డాక్టర్ వి.ఆర్. బాపారావు పాల్గొన్నారు.